క్లుప్తంగా

28న కౌన్సిల్ సమావేశం

దాచేపల్లి : స్థానిక నగర పంచాయతీ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎంవీ అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించడంతో పాటుగా అభివృద్ధి పనులకు, తాగునీటి పనులకు తీర్మానాలు ప్రవేశపెట్టుతామని, కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొన్నాలని ఆయన పేర్కొన్నారు.

పొందుగలలో ఇఫ్తార్ విందు



దాచేపల్లి : మండలంలోని పొందుగల మసీదులో సోమవారం రాత్రి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. తొలుత మసీదులో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. సర్పంచ్ షేక్ ఇమామ్‌వలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలను సర్పంచ్ ఇమామ్‌వలి దంపతులు ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మందపాటి రమేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ తండా అబ్దుల్‌సత్తార్, ఎంపీటీసీ ఆకూరి వెంకటరెడ్డి, నాయకులు జక్కా అశోక్, ఆవుల సైదులు, ముడి విక్టర్‌పాల్, నట్టు శ్రీనివాసరావు, వేల్పుల కిషోర్ పాల్గొన్నారు.

నవోదయలో విద్యార్థికి సీటు



వెల్దుర్తి: జవహర్ నవోదయ విద్యాలయ సమితి పోటీ పరీక్షల్లో మండలానికి చెందిన పేరుపోగు నిఖిల్ సీటు సాధించి నట్లు మండాది ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వీవీ రవికుమార్ మంగళవారం తెలిపారు. ఉపాధ్యాయుడు వై.శివ నాగరాజు నిఖిల్ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, కోచింగ్ ఇవ్వడంతో నిఖిల్ సీటు సాధించాడన్నారు.

పేదలకు అన్నదానం

గురజాల రూరల్ : దాతల సహకారం మరువలేనిదని స్మైల్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు బండి రవి కుమార్ అన్నారు. స్థానిక పాత పాటేశ్వరి అమ్మవారి ప్రాంగణంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు యాచకులు, నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు ఇంటి పన్ను చెల్లించాలి

పిడుగురాళ్ల: ఇంటి పన్ను బకాయి చెల్లింపుపై 50 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ మంగళవారం తెలిపారు. మార్చి 31 తేదీ లోపు ఇంటి పన్ను చెల్లించిన వారందరికి ఈ రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతకముందు కట్టిన వారందరికి కూడా వడ్డీ రాయితీ వర్తిస్తుందని వెల్లడించారు. వారికి వచ్చే ఆర్థిక సంవత్సరం ఇంటి పన్నులో మినహాయింపు ఉంటుందని ఆయన తెలిపారు.

నెలాఖరుకు పన్ను బకాయిలు చెల్లించాలి

మాచర్ల: పట్టణంలో ఇంటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను ఈ నెల 31వ తేదీలోపు చెల్లించవచ్చని మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గడువులోపు చెల్లిస్తే.. వడ్డీపై 50 శాతం రాయితీ ఇస్తారని చెప్పారు.

నేడు రుణ అర్హత మేళా

రెంటచింతల: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం క్రెడిట్ క్యాంప్(రుణ అర్హత మేళ)ను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె. సరోజినిదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంబంధించి ఎంఎస్ఎంఈ కింద స్వయం ఉపాధిలో భాగంగా బీసీ, ఈబీసీ, కాపు, జనరిక్ ఫార్మసీ లబ్ధిదారులకు ఈ క్రెడిట్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్న ఈ రుణ అర్హత మేళలో మండల పరిధిలోని వివిధ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్లు(సెలక్షన్ కమిటీ సభ్యులు), గ్రామ పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరుకావాలని ఆమె కోరారు. ఆన్‌లైన్ లో రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారు యావత్తు పత్రాలు రెండు సెట్లు ప్రింట్ తీసుకుని హాజరు కావాలన్నారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



ప్రిన్స్‌పల్ ఇందిరప్రియదర్శిని

క్రోసూరు: క్రోసూరు కేజీబీవీలో ఆరవ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ (గ్రూప్)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ ఇందిరాప్రియదర్శిని మంగళవారం తెలిపారు. ఆరవ తరగతికి 40 సీట్లు, ఇంటర్ ఎంపీసీ గ్రూప్‌కు 40 సీట్లు భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి ఏప్రిల్ 11 వరకు http// apkgbv.apcfss. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్, అనాథలు, పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు, దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వాహన చోదకులు ఎండకాలం అప్రమత్తంగా ఉండాలి. వాహనాల పర్యవేక్షణలో ఏ మాత్రం అశ్రద్ధ చేసినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. చిన్నపాటి నిర్లక్ష్యానికి ప్రాణాలు పాయే పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా వేసవిలో వాహనాల టైర్ల సంరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇటీవల కాలంలో వాహనాల టైర్లు పగిలి ప్రమాదాలు ఎక్కువగా జరిగాయి. ఈ ఘటనల్లో వాహనాలు తునాతునకలైపోవడంతో పాటు..పలువురి ప్రాణాలు సైతం రోడ్డుపాలయ్యాయి.



పిడుగురాళ్ల మండలం బ్రహ్మణపల్లి వద్ద టైరు పగిలి పల్టీలు కొట్టిన కారు

గడువు తీరితే రిటైర్ చేయాల్సిందే

- అప్రమత్తత లేకుంటే జీవిత 'చక్రం' తిరగబడుతుంది
- వేసవి కాలం వాహనాల టైర్ల విషయంలో జాగ్రత్తలు వహించాలి
- ప్రయాణ సమయాల్లో తరచూ తనిఖీలు చేయాలి
- నైట్రోజన్ ఎయిర్ తప్పనిసరి
- ఐఎస్ఐ మార్కు ట్యూబ్‌లెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి
- గడువు తీరిన, హడ్ అయిన టైర్లు వాడొద్దు

దాచేపల్లి: రోడ్డు ప్రమాదాలకు మితిమీరిన వేగం ఒక కారణమైతే.. ఎండకాలంలో టైర్ల సంరక్షణకు సరైన చర్యలు తీసుకోకపోవడం మరో కారణంగా పోస్టుమార్టంలో తెలుస్తోంది. ప్రస్తుత వేసవి కాలంలో ఇటువంటి ప్రమాదాలు మరిన్ని జరిగే అవకాశాలు ఉండటం వలన వాహనదారులు ముందుగానే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉంది. టైర్లు పేలడం, పక్చర్లు పడటం వల్ల ప్రమాదాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత వాహనదారులపైనే ఉంది.

టైర్లు పేలి జరిగిన ప్రమాదాలు..

పిడుగురాళ్ల మండలం బ్రహ్మణపల్లి వద్ద ఆదివారం కారు టైరు పేలిపోవడంతో కారు పల్టీలు కొట్టి బొల్తాపడింది.ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. దాచేపల్లి సమీపంలోని ఓ పెట్రోల్ బంకు వద్ద గత నెలలో కారు టైర్ పక్చర్ పడటం వల్ల ఓ వ్యక్తి దుర్మారణం చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. దాచేపల్లి మండలం పొందుగల సమీపంలో టైర్ పేలిపోవడంతో కారు బొల్తా పడింది. మాచవరం మండలం గంగిరెడ్డిపాలెం సమీపంలో కూడా కారు టైర్ పేలి ప్రమాదం జరిగింది. కార్లకు నాసిరకం టైర్లు, రీబటన్ టైర్లు వాడడం వల్లే.. ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వేసవికాలం కావడం వల్ల వాహనాల యజమానులు తప్పనిసరిగా టైర్ల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

టైర్ల సంరక్షణకు ఇవి పాటించండి..

- వేసవిలో పగటి ఉష్ణోగ్రతలు బాగా పెరుగుతున్న నేపథ్యంలో రోడ్లు బాగా వేడెక్కుతాయి. దీని వల్ల వాహనాల టైర్లు పేలిపోయి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.
- కారు టైర్లలో నైట్రోజన్ ఎయిర్ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి. నైట్రోజన్ ఎయిర్ రన్నింగ్‌లో టైర్లను కూల్ చేస్తుంది.
- ప్రయాణానికి ముందుగానే తప్పనిసరిగా టైర్లను పరిశీలించాలి. టైర్లలో గాలి ఒత్తిడి ఎంత ఉన్నదో తనిఖీ చేయాలి. కారు మోడల్‌ని బట్టి ఫ్రంట్ సైడ్ డోర్‌లో వివరాలు ఉంటాయి.
- సాధారణంగా అయితే ముందు టైర్లలో 35-40, వెనుక వైపు టైర్లలో 30 వరకు ఎయిర్ ఉండాలి.
- తరచూ వీల్ ఎలైన్‌మెంట్, స్టీరింగ్ బాక్స్ సరిగా ఉందా..లేదా అనేది పరిశీలన చేయాలి.
- ఐఎస్ఐ మార్క్ ఉన ట్యూబ్‌లెస్ టైర్ల వాడితే మంచిది. చైనా వీల్స్ వాడకుండా ఉండటం చాలా బెటర్. రీబటన్ టైర్లు అస్సలు వాడవద్దు.
- కారుల్లో సీటు బెల్టు ముందున్న వారితో పాటుగా వెనుక కుర్చున్న వారు కూడా పెట్టుకోవాలి. దూర ప్రయాణం చేసేటప్పుడు ఆరు గంటలకు మించి కంటిన్యూగా డ్రైవింగ్ చేయకూడదు.
- స్కూల్స్, కళాశాలల్లో పాతతరం బస్సులు నడపటం అంతా శ్రేయస్కరం కాదు. వేసవిలో పాత బస్సులకు ఉండే టైర్లు పేలి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయి.
- వేసవిలో మధ్యాహ్నం 12గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఎండతీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల ప్రయాణాలు చేయకుండా ఉండడం మంచిది.
- గడువు దాటిన, హడ్ అయిన టైర్లను వాడకూడదు. వేసవిలో టైర్లు పేలకుండా ఉండేందుకు రోడ్డుపై ఏర్పాటు చేసే బోర్డులో సూచించిన స్పీడ్‌తో మాత్రమే వెళ్లాలి.

గడువు తీరిన టైర్లను వాడొద్దు



కంపెనీ సూచించిన విధంగానే టైరుకి గాలి పట్టించాలి. ప్రతి టైర్‌కి గడువు ఉంటుంది. గడువు ముగిసిన టైర్లను ఎట్టి పరిస్థితుల్లో వాడవద్దు. ప్రతి 2వేల కిలోమీటర్లకి టైర్లు రోటేషన్ చేయాలి. 10 వేల కిలోమీటర్లకి ఫ్రంట్ టైర్లు ఎలైన్‌మెంట్ చేయించుకోవాలి. పాత టైర్లని అస్సలు వాడవద్దు.

– జి.సంజీవ్‌కుమార్, ఆర్టీవో, నరసరావుపేట

టైర్లపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటా



నా కారు టైర్లపై ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాను. ప్రయాణం చేసే దాని కంటే ముందుగానే టైర్లను చెక్ చేస్తా. ఎక్కువగా నైట్రోజన్ ఎయిర్ టైర్లలో పట్టిస్తారు. మనం ఎంత జాగ్రత్తగా వెళ్లిన టైర్లు సక్రమంగా లేకపోతే ఇబ్బంది పడతాం. గడువు కంటే ముందుగానే టైర్లను మారుస్తాను. ఎప్పటికప్పుడు వీల్ ఎలైన్‌మెంట్ చేయిస్తాను.

– కేవీ కుటుంబరావు, తహసీల్దార్, దాచేపల్లి

సీసీ రోడ్ల తనిఖీ



గుండ్లపాడులో సీసీ రోడ్డుని పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు

వెల్దుర్తి: మండలంలోని వివిధ గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన సీసీ రోడ్లను మంగళవారం క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా క్వాలిటీ కంట్రోల్ డీఈ శౌరిరాజు మాట్లాడుతూ మండలంలోని ఉప్పలపాడు, మండాది, గుండ్లపాడు, బోదిలవీడు, శ్రీరాంపురంతండ, రచ్చమల్లపాడు గ్రామాల్లో రూ.93 లక్షలతో నిర్మించిన 8 సీసీ రోడ్లను తనిఖీలు చేయడం జరిగిందన్నారు. సీసీ రోడ్ల మధ్యభాగంలో మిషన్ ద్వారా రోడ్డు గుంత తీసి ముక్కను ల్యాబ్‌లకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఏఈలు మల్లేశ్వర శర్మ, సత్యనారాయణ, పంచాయతీ రాజ్ ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నగర పంచాయతీ చైర్మన్‌గా షేక్ బడేజానీ



బడేజానికి శుభాకాంక్షలు తెలుపుతున్న నగర పంచాయతీ సిబ్బంది

గురజాల: నగర పంచాయతీ చైర్మన్‌గా షేక్ బడేజానీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు చైర్మన్‌గా ఉన్న పోలు పవన్మయి అనివార్య కారణాల వల్ల సెలవు పెట్టడంతో వైస్ చైర్మన్‌గా ఉన్న షేక్ బడేజానీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా నగర పంచాయతీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. నగర పంచాయతి అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. అవకాశం కల్పించిన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావుకు, కౌన్సిలర్లుకు కృతజ్ఞతలు తెలిపారు. కౌన్సిలర్‌గా గెలిపించిన మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రతి ఒక్కరికి ఉపాధి హామీ పనులు



తుమ్మకోటలో కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ జయచంద్రకుమార్

రెంటచింతల: ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పిస్తామని ఏపీఓ జయచంద్రకుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పంట కాల్వల అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. 2024-2025లో గుర్తించిన పనులను ప్రభుత్వ నిబంధనల మేరకు సకాలంలో పూర్తి చేయాలన్నారు. రూ. 8.50 కోట్లకు విలువైన 382 పనులకు ప్రభుత్వం నుంచి అనుమతి లభించిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. 11 గ్రామాలకు సంబంధించి ఇప్పటి వరకు 10,750 మందికి ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డులు అందజేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం మండలంలో మొత్తం 257 మంది ఉపాధి పనులకు వస్తున్నారన్నారు.

కొత్తపుల్లారెడ్డి గూడెంను సారా రహితం చేద్దాం



గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

వెల్దుర్తి: కొత్తపుల్లారెడ్డి గూడెంను సారా రహిత గ్రామంగా చేద్దామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ రవికుమార్, డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావులు అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని కొత్తపుల్లారెడ్డి గ్రామంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గ్రామంలో సారా తయారు చేసిన, తాగిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్తులందరూ సహకరించి గ్రామాన్ని సారా రహిత గ్రామంగా చేద్దామన్నారు. చట్టానికి వ్యతిరేకంగా ఎవరైనా సారా కాసినా, అమ్మినా వారిని పట్టించి పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి కుటుంబాలను అభివృద్ధి పర్చుకోవాలన్నారు. అనంతరం గ్రామస్తులతో సారా తయారు చేయం, విక్రయించమని ప్రతిజ్ఞ చేయించారు. ఎక్సైజ్ సిబ్బంది సుధాకర్‌రెడ్డి, సూర్యనారాయణ, ఎంపీడీఓ డి.ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన డీఎంహెచ్‌ఓ



ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉదయభానుతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవి

మాచర్ల: పట్టణంలో కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి మంగళవారం సందర్శించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుకున్నారు. డెలివరీ కేసులు, వైద్య సేవల గురించి వివరాలు సేకరించారు. డెలివరీ కేసుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. పుట్టిన, మరణించిన సర్టిఫికెట్లపై జాగ్రత్తలు వహించాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉదయభానుకు పలు సూచనలు చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. నర్సులు, వైద్యులు, వైద్య సిబ్బందితో సమీక్ష జరిపారు.

విధి నిర్వహణలో నిబద్ధత కలిగిన ఉద్యోగి రామకృష్ణ



రామకృష్ణను బహుమానంతో సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెదకూరపాడు: ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులను అ మండల ప్రజలు మరువరని ఇన్‌చార్జి ఎంపీడీవో సోమయాజులు అన్నారు. పెదకూరపాడు ఎంపీడీవో రామకృష్ణ విధి నిర్వహణలో భాగంగా బాపట్ల ట్రైనింగ్ సెంటర్‌కు గెజిటెడ్ ఫ్యాకల్టీగా బదిలీపై వెళ్తున్న సందర్భంగా మంగళవారం పెదకూరపాడులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో సోమయాజులు మాట్లాడుతూ ఎన్నికల అనంతరం కాకుమాను మండలం నుంచి బదిలీపై పెదకూరపాడు వచ్చిన రామకృష్ణ అనతి కాలంలో మండల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. గ్రామాల్లో పారిశుద్ధ్య, తాగునీటి సమస్యల పరిష్కారానికి విశేష సేవలు అందించారని పలువురు కార్యదర్శులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం బొబ్బా సునీత, ఏపీవో కోటేశ్వరరావు, కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, మందా ఫ్రాన్సిస్ తదితరులు ఎంపీడీవో రామకృష్ణను సత్కరించారు.

లారీ కింద పడి యువకుడి మృతి



మృతుడు సాగర్

కారెంపూడి: లారీ కింద పడి యువకుడు దుర్మరణం చెందిన ఘటన స్థానిక నర్సరావుపేట వెళ్లే రోడ్డులో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ప్రమాదంలో మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామానికి చెందిన వేముల సాగర్ (19) మృతి చెందాడు. వివరాల మేరకు.. నర్సరావుపేట వైపు నుంచి వస్తున్న లారీని చింతపల్లి గ్రామ రోడ్డు జంక్షన్ వద్ద ఉన్న పెట్రోలు బంకు సమీపంలో సాగర్ ఓవర్ టేక్ చేస్తున్న సమయంలో బైక్ అదుపుతప్పి లారీ కింద పడిపోయాడు. లారీ వెనుక టైరు కింద పడడంతో సాగర్ పక్కటెముకలు నలిగిపోయి కొన ఊపిరితో ఉండగా కారెంపూడిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడకు తీసుకెళ్లిన నిమిషాల వ్యవధిలోనే సాగర్ ప్రాణాలు విడిచాడు. ఇదిలా ఉంటే సాగర్‌తో పాటు బైక్ వెనుక కూర్చున్న మరో యువకుడు బైక్‌పై నుంచి పక్కకు దూకి ప్రాణాలు కాపాడుకున్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలాన్ని ఎస్ఐ వాసు పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కుమారుడిని కోల్పోయి నరసింహారావు, భూలక్ష్మి దంపతులు విలపిస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు కూడా ఉన్నారు.

మృతిరాలి కుటుంబానికి పరామర్శ

పిడుగురాళ్ల: వాల్మీకి బోయ సామాజిక వర్గానికి చెందిన యువతి తాటి ఆదిలక్ష్మి హత్యని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ముప్పన వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండించారు. మంగళవారం మృతురాలి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. అనంతరం ముప్పన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఆదిలక్ష్మి హత్యలో నిందితుడైన ఏడుకొండలను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు సమాజంలో జరగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ హత్యకు సహకారం అందించిన వారిపై కూడా తగు చర్యలు తీసుకొని ఆదిలక్ష్మి కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మీనిగల అంజిబాబు, మల్లారవి, దుగ్గ నాగేశ్వరరావు, మల్లా ఏడుకొండలు, మల్లా శ్రీకాంత్, నల్లబోతుల నాగ, చొప్పరపు నాగరాజు ఉన్నారు.

పారిశుద్ధ్యం పరిశీలన

మాచర్ల: పట్టణంలో గుడ్‌మార్నింగ్ మాచర్ల కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మెయిన్ రోడ్డు, 15వ వార్డులో కాల్వ కట్ట ప్రాంతాల్లో పురపాలక సంఘ చైర్మన్ పోలూరి నరసింహారావు మంగళవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకున్నారు. 30వ వార్డు చంద్రవంక బ్రిడ్జిపై కాలువ కట్ట లేక ఇబ్బందులు పడుతున్నామని, స్థానికులు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డీఈ సుభానికి సూచనలు చేశారు. చైర్మన్ వెంట ఒకటో వార్డు కౌన్సిలర్ జి.కోటిరెడ్డి, స్థానిక ప్రజలు ఉన్నారు.

కంప్యూటరీకరణ ద్వారా సంఘాల లావాదేవీలు పారదర్శకం



మాట్లాడుతున్న సంఘ పర్సన్ ఇన్‌చార్జి ఎంవీ నరసయ్య

సత్తెనపల్లి: కంప్యూటరీకరణ ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల లావాదేవీలు జరపడం వలన మరింత పారదర్శకత చేకూరుతుందని సంఘ పర్సన్ ఇన్‌చార్జి ఎంవీ నరసయ్య అన్నారు. సత్తెనపల్లి మండలం పాకాలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో సంఘ సభ్యులకు కంప్యూటరీకరణపై అవగాహన కల్పించేందుకు సెమినార్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ డిజిటల్ సాంకేతికత ఉపయోగించి సంఘాల నిర్వహణను సమర్థవంతంగా చేసుకునే మార్గాలను వివరించారు. సభ్యులు నేటి ఆధునిక వ్యవస్థలతో అనుసంధానం అవ్వడం ఎంతో ప్రయోజనకరమన్నారు. ముఖ్యంగా లెక్కల నిర్వహణ, డేటా భద్రత, ఆన్‌లైన్ లావాదేవీలు వంటి అంశాలపై చర్చించారు. సంఘ సీఈవో అన్నదాత సాయిబాబు మాట్లాడుతూ సంఘాల డిజిటలైజేషన్ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులకు మార్గదర్శనం చేసి సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

డయల్ యువర్ డీఎంకు ఏడు సమస్యలు



డయల్ యువర్ డీఎంలో సమస్యలు వింటున్న డీఎం జీఎస్‌వీవీ కుమార్

సత్తెనపల్లి: డయల్ యువర్ డీఎంకు ఆర్టీసీ ప్రయాణికుల నుంచి ఏడు సమస్యలు వచ్చినట్లు సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ డీఎం నిర్వహించారు. దీనిలో భాగంగా సత్తెనపల్లిలోని నరసరావుపేట పాయింట్ వద్ద బస్‌కి బస్‌కి మధ్య గ్యాప్‌లో ఆటోలు ఆపి ప్రయాణికులను ఎక్కించుకొని పోతున్నారని, అలా కాకుండా చూడాలని సత్తెనపల్లి నుంచి ప్రయాణికుడు ప్రభాకర్ కోరగా... ఆ పాయింట్‌లో కంట్రోలర్‌ను పెట్టి బస్సు వచ్చిన పిదప బస్సులు పంపించే ఏర్పాటు చేస్తామని, ఆటోల విషయంపై సత్తెనపల్లి డీఎస్పీకి లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇచ్చామన్నారు. సత్తెనపల్లి నుంచి హైదరాబాద్‌కి కొత్త బస్సు కావాలని సత్తెనపల్లికి చెందిన ఎస్.శివ శంకర ప్రసాద్, అనీలు వేర్వేరుగా కోరగా కొత్త బస్సు కోసం ఉన్నతాధికారులకు తెలియపరిచి నిర్ణయం తీసుకుంటామని డీఎం సమాధానం ఇచ్చారు. పెదకూరపాడు బస్టాండ్‌లో ఫ్యాన్లు, టైమింగ్ బోర్డులు కావాలని, బస్టాండ్‌లో ఉన్న పోస్టర్లను తీసివేయాలని పెదకూరపాడుకు చెందిన హనుమయ్య కోరగా రెండు మూడు రోజుల్లో ఏర్పాటు చేస్తామని, పోస్టర్లను తీసివేస్తామని డీఎం తెలిపారు. సత్తెనపల్లి నుంచి గుంటూరుకు వయా పేరేచర్ల, పలకలూరు మీదుగా బస్సు సౌకర్యం కావాలని గుంటూరుకు చెందిన మహేష్ కోరగా గతంలో ఈ విధంగా బస్సులను నడిపామని.. ఆదరణ లేనందున రద్దు చేశామని, ఉన్నతాధికారులకు తెలియజేస్తామని చెప్పారు. అమరావతి నుంచి సత్తెనపల్లి మీదుగా శ్రీశైలంకు బస్సు నడపాలని సత్తెనపల్లికి చెందిన హనుమంతరావు కోరగా దీనిపై ఉన్నతాధికారులకు తెలియపరచి పరిష్కరిస్తామన్నారు. క్రోసూరు మండలం 88 తాళ్లూరు నుంచి సత్తెనపల్లికి ప్రస్తుతం ఉదయం, సాయంత్రం ట్రిప్పు కాకుండా మధ్యలో అదనంగా ఒక ట్రిప్పు కావాలని 88 తాళ్లూరుకు చెందిన షేక్ ఖాజా హుస్సేన్ కోరగా.. మధ్యలో ట్రిప్పు విషయంపై ఉన్నతాధికారులను సంప్రదించి చేయగలమని డీఎం కుమార్ సమాధానం ఇచ్చారు.

న్యాయవాది ఇబ్రాయిల్ హత్య దారుణం



సత్తెనపల్లి: హైదారాబాద్ రంగారెడ్డి న్యాయస్థానంలో న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్న ఇబ్రాయిల్ అనే న్యాయవాదిని దస్తగిరి అనే కరెంట్ పని చేసే వ్యక్తి హత్య చేయడం దారుణమని న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు. న్యాయవాద పరిరక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్నికల అధికారి గుజ్జర్లపూడి మార్క్‌రావు అధ్యక్షతన మంగళవారం నాలుగు న్యాయస్థానాల్లోని న్యాయవాదులు విధు లు బహిష్కరించారు. దస్తగిరి అనే వ్యక్తి ఒక మ హిళను తీవ్రంగా వేధించటం వలన ఆమె న్యా యవాది ఇబ్రాయిల్‌ను ఆశ్రయించటంతో కేవలం ఇబ్రాయిల్ ఆమెకు న్యాయ సేవలు అందిస్తున్నాడన్నారు. ఈ అక్కసుతో సదరు దస్తగిరి న్యాయవాది ఇబ్రాయిల్‌ను అతి దారుణంగా హత్య చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. దస్తగిరిని కఠినంగా శిక్షించాలని, న్యాయవాద పరిరక్షణ చట్టం పటిష్టంగా అమలు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు చిట్టా విజయభాస్కర రెడ్డి, దివ్వెల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ విజయ్ కుమార్, బీఎల్ చిన్నయ్య, చిన్నం మణిబాబు, చావా బాబురావు, జూపల్లి శేషయ్య, రాజవరపు నరసింహారావు, బుతుకూరి రామిరెడ్డి, బుర్రి సైదయ్య, తవ్వా హరినాథ్, షేక్ జానీ ఖాజావలి, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

సింగరయ్య యాదవ్‌కి సన్మానం



దాచేపల్లి : వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగాల సింగరయ్య యాదవ్‌ని మంగళవారం సన్మానించారు. ఇటీవల సింగరయ్య యాదవ్‌ని బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. నారాయణపురంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనని శాలువా, పూలదండలతో ఘనంగా సన్మానించి అభినందించారు. పార్టీ బలోపేతం కోసం తనవంతు కృషి చేస్తానని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ప్రమాణస్వీకారం చేసేంత వరకు పని చేస్తానని సింగరయ్యయాదవ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు మందపాటి రమేష్‌రెడ్డి, ఎస్సీసెల్ పట్టణశాఖ అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులున్నారు.